

పాలకులు అవినీతి పరుడైతే..

నీతిమంతులు జైలు పాలవుతారు

- ఫిడెల్ కాస్ట్రో

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 2 | సంచిక : 61 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 5-11-2023 | పేజీలు : 4



# నేపాల్‌లో భారీ భూకంపం

- పెరుగుతూ పోతున్న మృతుల సంఖ్య
- ఢిల్లీలోనూ భూప్రకంపనలు

**నేపాల్, నవంబర్ 4 :** హిమాలయన్ దేశంలో భూకంపం సంభవించి సుమారు 128 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. అందుకు సంబంధించిన వివరాలను అక్కడి అధికారులు వెల్లడించారు. నేపాల్‌లోని వాయువ్య జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూకంపం సంభవించినట్లు పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల మధ్యే సహాయ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రి కావడం వల్ల పలు ప్రాంతాలతో కమ్యూనికేషన్ తెగిపోయిందని అధికారులు తెలిపారు. దీంతో తొలుత ప్రమాద తీవ్రత తెలియలేదని చెప్పారు. ప్రజలంతా నిద్రలో ఉన్న సమయంలో భూకంపం సంభవించినట్లు వెల్లడించారు. భూకంపం



ధాటికి రోడ్లపై కొండ చరియలు విరిగిపడడం, వంతెనలు దెబ్బతినడం వల్ల సహాయ చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. జజార్‌కోట్‌లో భూకంపం తర్వాత కూడా నాలుగు ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 11 గంటల తర్వాత జాజర్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లో రిక్టర్ స్కేల్‌పై 6.4తీవ్రతతో భూకంపం సంభవించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంప కేంద్రం 11 మైళ్ల లోతులో ఉన్నట్లు గుర్తించింది.

**మృతుల కుటుంబాలకు నేపాల్ ప్రధాని సంతాపం**

జాజర్‌కోట్, రుకుమ్ జిల్లాలో భూకంప ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లోనే 128 మంది మృతి చెందారు. ప్రధాన మంత్రి పుష్పకమల్ దహల్ భూకంప ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. భూకంపం వల్ల సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టంపై నేపాల్ ప్రధాని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నేపాల్‌లో 2015 లో 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా తొమ్మిది వేల మంది మరణించారు

**ఢిల్లీలోనూ భూప్రకంపనలు**

మరోవైపు, నేపాల్‌లోని భూకంప తీవ్రతకు మిగతా 2లో..

# చంద్రబాబును పరామర్శించిన పవన్ కల్యాణ్

- జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్



**హైదరాబాద్, నవంబర్ 4 :** టీడీపీ అధినేత చం ద్రబాబు శుక్రవారం హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. శనివారం ఉదయం నగరంలోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి కంటి పరీక్షలు చేయించుకుని వచ్చారు. చంద్రబాబు మంగళ వారం కంటికి సంబం ధించిన శస్త్రచికిత్స చేయించుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, చంద్రబాబును జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పరామర్శించారు. శనివారం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ రోడ్ నెం.65లోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. పవన్ వెంట జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పవన్ చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యం సంతరించుకోవాలని ఆకాంక్షించారు.

**పవన్‌తో నారా లోకేష్ అత్యవసరభేటీ..**

పరామర్శ అనంతరం రాజకీయాలపై చర్చించారు. దాదాపుగా 45 నిమిషాల నుంచి నారా లోకేష్ తో జనసేన నేతలు భేటీ కొనసాగుతోంది. ఆంధ్ర, తెలంగాణ రాజకీయాలపై ఈ చర్చ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. జైలులో చంద్రబాబును కలిసి వచ్చిన తర్వాత జరిగిన రెండు పక్షాల సమన్వయ కమిటీ భేటీ, జిల్లాల్లో సమావేశాలు తదితర అంశాలపై మంతనాలు జరుపుతున్నారు. రెండు పక్షాలు కలిసి మేనిఫెస్టో విడుదల, క్షేత్ర స్థాయి పోరాటాలు వంటి అంశాలపై కూడా చర్చిస్తున్నారు. బీజేపీ వైఖరిపై కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. బీజేపీ పార్టీతో భవిష్యత్ లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలనే అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో బీజేపీ, జనసేనల పొత్తు ఖరారు

- 9 సీట్లను జనసేనకు కేటాయించిన బీజేపీ
- కూకట్ పల్లి సహా గ్రేటర్ లో మరో స్థానంలోనూ జనసేన పోటీ
- మిగిలిన సీట్లకు అభ్యర్థులను ప్రకటించనున్న బీజేపీ



**హైదరాబాద్, నవంబర్ 4 :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేయాలని బీజేపీ, జనసేన పార్టీలు నిర్ణయించాయి. కొన్నిరోజులుగా జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చాయి. తాజాగా రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరింది. పొత్తులో భాగంగా తెలంగాణలో 9 సీట్లను జనసేనకు కేటాయించినట్లు సమాచారం. ఇందులో గ్రేటర్ పరిధిలోని కూకట్ పల్లి కూడా ఉందని, దీంతోపాటు మరో చోట కూడా జనసేన అభ్యర్థిని బరిలోకి దించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇక రాష్ట్రంలో మిగతా సీట్లలో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఇప్పటికే రెండు జాబితాలు విడుదల చేసిన బీజేపీ.. అభ్యర్థుల తుది జాబితాను సిద్ధం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ నేతలతో జనసేనాని పలుమార్లు చర్చలు జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 చోట్ల బరిలోకి దిగాల్సిందేనని నాయకులు పట్టుబట్టారు. ఆ దిశగా నాయకులు చేసిన ప్రతిపాదనపై పవన్ కల్యాణ్ పరిశీలన జరిపారు. తాజాగా బీజేపీతో పొత్తు కుదరడంతో తెలంగాణలోని ఆ తొమ్మిది సీట్లలో మాత్రమే పోటీ చేయాలని, మిగతా చోట్ల బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ నిర్ణయించింది. కాగా, కూకట్‌పల్లి తో పాటు గ్రేటర్‌లో మరో సీటు, వైరా, ఖమ్మం, అశ్వారావుపేట, కొత్తగూడెం, కోదాడ, నాగర్‌కర్నూల్, తాండూరు స్థానాల నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేయనున్నారు.

# నాడు దుగ్గిరాల.. నేడు మాదిగాని..

3లో..





# బెయిల్‌పై ఉంటూనే అక్రమాలు

- విజయసాయిరెడ్డిపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు పురందేశ్వరి ఫిర్యాదు
- తక్షణమే బెయిల్ రద్దు చేయాలని విన్నపం

**విజయవాడ, నవంబర్ 4 :** వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్ర చూడ్‌కు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందే శ్వరి ఫిర్యాదు చేశారు. అక్రమాస్తుల కేసులో బెయిల్‌పై ఉన్న విజయసాయి అరాచ కాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్ వివే కానంద రెడ్డి హత్య జరిగినప్పుడు ఆయన గుండెపోటుతో చనిపోయారని ప్రజలందరినీ తప్పు దోవ పట్టించారని తెలిపారు. ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్చార్జీగా ఉన్నప్పుడు... కడప గూండాలను అక్కడ దించి, భారీగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని చెప్పారు. ఎం దరినో బెదిరిస్తూ అక్రమాలు, అరాచకాలు చేశారని తెలిపారు. విజయసాయిరెడ్డిపై ఉన్న అన్ని కేసుల వివరాలను తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే విజయసాయిపై 11 అభి యోగాలు, పలు సెక్షన్ల కింద కేసులు ఉన్నాయని పురందేశ్వరి తెలిపారు. పదేళ్లుగా బెయిల్‌పై బయట ఉంటూ... సీబీఐ, ఈడీ కేసుల్లోని షరతులను ఉల్లంఘిస్తున్నా రని చెప్పారు. ప్రతి కేసులోనూ విచారణ జరగకుండా నిరోధిస్తున్నారని తెలిపారు. పదేపదే వాయిదా లు కోరుతూ విచారణ కొన సాగకుండా అడ్డుకుంటున్నారని, అధికార దుర్వినియోగానికి పాల్పడు తున్నారని చెప్పారు. విజయ సాయి బెయిల్‌ను వెంటనే రద్దు చేయాలని సీజేఐని కోరారు. విజయ సాయిపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

# జీవితం - వి"చిత్రం"



twitter : @telugu toonz

# ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 5 నవంబర్ 2023

తిథి : బహుళ సప్తమి (తా.01:03 వరకు) బహుళ అష్టమి (06తా తె.3:22 వ.కు), నక్షత్రం : పుష్యమి (ఉ.10:31వ.కు)

బ్రహ్మముహూర్తం : తె 4.43 నుండి తె. 5:31 వరకు,

రాహుకాలం : సా.04:15 నుండి సా.05:40 వరకు,

యమగండం : మ.12:00 నుండి మ.01:25

వర్జ్యకాలం : 06తా తె.00:49ల, 06తా తె.02:50

# ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 5 నవంబర్ 2023

ఫజర్ : తెల్లవారుజామున గం. 5:03

సూర్యోదయం : ఉదయం గం. 6:16

జొహర్ : మధ్యాహ్నం గం. 12:00

అసర్ : సాయంత్రం గం. 3:17

మఘ్రిబ్ : సాయంత్రం గం. 5:44

ఇష : రాత్రి గం. 6:58

# వైసీపీ పాలనలో పంచాయితీల అభివృద్ధి కుంటుపడింది



4లో..

**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా

# పంటల సాగు పడిపోయింది....!

- 16 లక్షల ఎకరాల్లో విత్తే పడలేదు
- 11 శాతం తగ్గిన విస్తీర్ణం
- సంక్షోభం దిశగా వ్యవసాయరంగం
- అయినా 20 శాతం వృద్ధి అంచనా వేసిన జగన్ సర్కార్
- డ్రైస్పెల్ నెలకొన్నా కరవు మండలాల ప్రకటన ఏదీ?



సాగు సంక్షోభంలో కూరుకుపోతోంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల విస్తీర్ణం గణనీయంగా పడిపోవడం చూస్తుంటే ఇదే అభిప్రాయం కలుగుతోంది. కొన్ని పంటలు అసలు గిట్టుబాటుకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వరి సాగుకు కనీసం కౌలు రైతులు కూడా ముందుకు రావడం లేదు. ఇక అపరాల సాగు చేసినా తెగుళ్లు, చీడపీడల దాడి తట్టుకుని దిగుబడులు సాధించడం కష్టం అవుతోంది. వేరుసెనగ పంట పరిస్థితి కూడా దయనీయంగా తయారైంది. దీంతో ఖరీఫ్, రబీల్లో లక్షలాది ఎకరాలను బీడుగా వదిలేశారు. మాది రైతు సంక్షేమ ప్రభుత్వం అని గొప్పగా చెప్పుకుంటోన్న జగన్ రెడ్డి సర్కార్ మాత్రం 2022-23లో వ్యవసాయ రంగంలో 20 శాతం వృద్ధి నమోదు అంచనా వేసింది. సాగు తగ్గిన నేపథ్యంలో వృద్ధి ఎలా సాధ్యమో అంతుపట్టడం లేదు.

**బీడులవుతున్న పంట పొలాలు**

కొన్ని పంటల సాగు రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఏటా నష్టాలు రావడంతో రైతులు వరి, అపరాలు, నూనెగింజల పంటల సాగుకు ఆసక్తి చూపడం లేదు. 2022-23 ఖరీఫ్, రబీల్లో 16.25 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖరీఫ్, రబీ పంటల మొత్తం సాగులో ఇది 10.88 శాతానికి సమానం. ఇందులో ప్రధానంగా 6.44 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. ఖరీఫ్ సీజన్లో 5.49 లక్షల ఎకరాలు, రబీలో 10.77 లక్షల ఎకరాల్లో అన్ని పంటల సాగు తగ్గింది. మొత్తం మీద 2022-23లో 16.25 లక్షల ఎకరాల్లో సాగు తగ్గిందని ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా వరి, అపరాలు, వేరుసెనగ, సెనగ, జొన్న పంటల సాగు తగ్గింది. గడచిన ఏడేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు. ముఖ్యంగా వరి, అపరాలు, వేరుసెనగ పంటల సాగు ఏ మాత్రం గిట్టుబాటు కాకపోగా ఏటా నష్టాలే వస్తున్నాయి. వరి సాగు ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఖర్చులే అధికంగా అవుతున్నాయి. దీనికితోడు ప్రకృత్తి విపత్తులు వస్తే పంట పెట్టుబడి మొత్తం కోల్పోవాల్సి వస్తోంది. దీంతో వరి సాగుకు కౌలుదారులు ముందుకు రావడం లేదు. రైతులు కూడా పొలాలను బీడుగా వదిలేస్తున్నారు. వరి సాగు చేసినా దొడ్డు రకాల ధాన్యం అమ్ముకునేందుకు నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఇది కూడా వరి సాగు తగ్గిపోవడానికి ప్రధాన కారణం. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్ లో కూడా చాలా పొలాల్లో వరి సాగు చేయకుండా పంట విరామం ప్రకటించారు. ఇక నూనెగింజల పంటల విషయానికి వస్తే ఖరీఫ్ లో 19 శాతం, రబీలో 14 శాతం తగ్గింది. అపరాల సాగు ఖరీఫ్ లో 16 శాతం, రబీలో 25 శాతం తగ్గింది. పెసర పంట అయితే రబీలో 30 శాతం, ఖరీఫ్ లో 33 శాతం సాగు తగ్గింది. ఈ పంటలు సాగు చేసినా కనీసం ఖర్చులు కూడా రాకపోవడంతో పొలాలు బీడు పెట్టినట్టు రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు కాకపోవడంతో కొన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోగా, మంచి ధరలు దక్కుతున్న పత్తి, మిర్చి పంటలు సాగు చేసేందుకు కొందరు రైతులు ఆసక్తి చూపుతున్నారు. 2022-23లో పత్తి సాగు 1.37 లక్షల ఎకరాలు, మిరప 1.92 లక్షల ఎకరాలు పెరిగింది. గత ఏడాది మొక్కజొన్న ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో మొక్కజొన్న సాగు కూడా స్వల్పంగా పెరిగింది.

**కొంప ముంచిన డ్రైస్పెల్**

2022-23 ఖరీఫ్ ప్రారంభంలో 273 మండలాల్లో పొడి వాతావరణం

## ఎడిటోరియల్

నెలకొంది. వరుసగా మూడు వారాలపాటు వాన లేకుంటే డ్రైస్పెల్ నెలకొన్నట్లు భావిస్తారు. 21 రోజులపాటు వర్షాలు నమోదు కాలేదని అధికారులే ప్రకటించారు. ఖరీఫ్ విత్తనాలు వేసుకునే సమయంలో వర్షాలు లేకపోవడంతో రైతులు పొలాలను వదిలేశారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో డ్రైస్పెల్ మండలాలు అధికంగా ఉన్నాయి. కర్నూలు 15, సత్యసాయి 15, ప్రకాశం 13, అనంతపురం 12, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో 11 మండలాల చొప్పున ఉన్నాయి. కరవు మండలాలుగా ప్రకటించాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ పాలనలో ఒక్క కరవు మండలం కూడా లేదని చెప్పుకునేందుకే ఇలా చేశారనే విమర్శలు వస్తున్నాయి. కరవు మండలాలుగా ప్రకటిస్తే రైతులకు పెట్టుబడి రాయితీలు ఇవ్వాల్సి వస్తుందనే సాకుతో వర్షాలు సకాలంలో కురవని 273 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించలేదని తెలుస్తోంది.

**ఏడేళ్లలో ఎన్నడూ లేదు....**

ఏడేళ్లలో ఎన్నడూ లేని విధంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. 2016-17 ఖరీఫ్ లో 96.60 లక్షల ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారు. 2022-23 నాటికి అది 86.55 లక్షల ఎకరాలకు పడిపోయింది. 2016-17 రబీలో 50.07 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, 2022-23 నాటికి అది 46.52 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. 2016- 17లో ఖరీఫ్, రబీల్లో మొత్తం సాగు విస్తీర్ణం 146.67 లక్షల ఎకరాలు కాగా, 2022-23 రెండు సీజన్లలో 133.07 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. సాగు విస్తీర్ణం ఏటికేడాది తగ్గిపోతోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. వరి సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, అపరాల పంటల్లో ఆశించిన దిగుబడులు రాకపోవడం, వేరుసెనగ పంట దిగుబడులు పడిపోవడంతో ఈ పంటల సాగు తగ్గింది. గిట్టుబాటు కాని పంటలను వదిలేసి ధరలు ఆశాజనంగా ఉన్న పత్తి, మిర్చి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొన్ని పంటల సాగు తగ్గగా, మరికొన్ని పంటల సాగు కొద్దిగా పెరిగింది.

**సాగు తగ్గితే వృద్ధి ఎలా సాధ్యం?**

రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయం వెల్లడిస్తున్నాయి. అయితే అధికారులు, సీఎం జగన్ రెడ్డి వాదన మాత్రం విచిత్రంగా ఉంది. 2022-23 లో ఖరీఫ్, రబీలో వరి సాగు 6.44 లక్షల ఎకరాలు తగ్గింది. ఎకరాకు సగటున 20 క్వింటాళ్ల దిగుబడి లెక్కించినా రూ.2628 కోట్ల విలువైన పంట ఉత్పత్తి తగ్గింది. అయితే ప్రభుత్వం మాత్రం 20 శాతం వృద్ధి నమోదవుతుందని అంచనా వేయడం గమనార్హం. 11 శాతం పంటల సాగు విస్తీర్ణం తగ్గితే, 20 శాతం ఉత్పత్తి ఎలా పెరుగుతుందో జగన్ రెడ్డికే తెలియాలి. రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసీపీ సర్కార్, సాగు విస్తీర్ణం ఇంత దారుణంగా ఎందుకు తగ్గిందనే విషయాన్ని మాత్రం విశ్లేషించకపోవడం శోచనీయం.

## డంపింగ్ యార్డ్ ని ఎప్పుడు తరలిస్తున్నారు?



**అనంతపురం, నవంబర్ 4 (జనస్వరం) :** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఎన్నికల ముందర అనంత నగర ప్రజలకు ప్రధాన హామీగా ఇచ్చిన డంపింగ్ యార్డ్ ని ఎప్పుడు తరలిస్తున్నారు? 20 సంవత్సరాలుగా రాజీవ్ కాలనీ పంచాయితీ, గుత్తి రోడ్డు నందు నివాసం ఉంటున్న ప్రజలు డంపింగ్ యార్డ్ సమస్య వల్ల నరకయాతన అనుభవిస్తున్నారని అనంతపురం జిల్లా జనసేన ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి అన్నారు. శ్వాస కోస వ్యాధులకు గురై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే బయోమైనింగ్ ప్రక్రియ, అనుభవం లేని కంపెనీకి కాంటాక్ట్ ఇవ్వడం వలన పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, సాక్షాత్తు వైసిపి కౌన్సిలర్లు, కౌన్సిల్ మీటింగులో మాట్లాడుతున్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మీకు కూడా? తెలియకుండా డంపింగ్ యార్డ్ తరలింపు ప్రక్రియలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగే అవకాశం ఉంది అంటారా? అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రాం రెడ్డిని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం డంపింగ్ యార్డ్ అవినీతి, అక్రమాలపైన తగిన విచారణ జరిపి అనంత నగర ప్రజలకు వాస్తవాలు తెలియజేసి మేము స్వచ్ఛ స్వచ్ఛశీలులం అని రూపించుకోవాలి? తక్షణమే యుద్ధ ప్రాతిపదిక పైన డంపింగ్ యార్డ్ ని గుత్తి రోడ్డు నుంచి తరలించి అనంతపురం నగర ప్రజల ఇక్కట్లు తీర్చాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## ఘనంగా బత్తిన మధుబాబు జన్మదిన వేడుకలు



**మదనపల్లి, నవంబర్ 4 (జనస్వరం) :** స్థానిక టమాటా మార్కెట్ యార్డు వద్ద కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య రైతుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగాయి. అభిమానులు బలిజ కులస్తులు మేళతాళాలతో టపాకాయలు పేల్చి మధుబాబు గారికి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో మదనపల్లి జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు మరియు చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి దారం అనిత, కాపు సంక్షేమ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్, అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి రాణి, ములకలచెరువు జనసేన పార్టీ మండల అధ్యక్షులు పోతుల సాయినాథ్, తంబాలపల్లి కాపు సంక్షేమ శాఖ అధ్యక్షులు అధికారి దేవేంద్ర, అర్జున్ తిరుపతి జిల్లా కాపు సంక్షేమ శాఖ అధ్యక్షులు హిమవంత్ రాయల్, మల్లికా, రూప, తిరుపతి రూరల్ జనసేన అధ్యక్షులు వెంకట్, రైతు విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు రమేష్ రాయల్, తంబాలపల్లి జనసేన నాయకులు రాజన్న, పవర్ ఆఫ్ ద టీం అధ్యక్షులు. గుమ్మిశెట్టి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిలుగా హాజరై జన్మదిన వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో దుబాయ్ శీను, రెడ్డి సురేష్, అశ్వత్ రాయులు సుప్రీమ్ హర్ష తుపాకుల ధరణి రాయల్, శోభ, లక్ష్మీదేవి, తక్కోళ్ల శివ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రమేష్ సిద్దు, స్టీఫెన్, సోను, యూనస్ బొమ్మిశెట్టి రాజా, పసుపులేటి మూర్తి, శివ స్వామి వెంకటేష్, ఫాల్గుణ, గంగాధర చిన్న రెడ్డి, రాయదుర్గం జనార్ధన, మరియు వందలాది మంది కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. సవికుల ప్రసంగం అనంతరం కేక్ కటింగ్ మరియు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సమావేశానికి పాల్గొన్న ముఖ్య అతిథులు శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, దారం హరిప్రసాద్ ని మర్యాద పూర్వకంగా కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తిన మధు బాబు సన్మానించారు.

## ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని భరోసా



**శ్రీకాళహస్తి, నవంబర్ 4 (జనస్వరం) :** 3వ రోజు "జనసేన విజయ యాత్ర - ఏపీ నీడ్స్ పవన్ కల్యాణ్" కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్ట కాలనీలో పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి ఈ రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ నాయకత్వం అవశ్యకతను వివరిస్తూ, ముఖ్యమంత్రి జగన్ ఈ రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాన్ని, దోపిడీలను వివరించడం జరిగింది. రానున్న ఎన్నికల్లో జనసేన - టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ఆశీర్వదించాలని ప్రజలను కోరడం జరిగింది. నిత్యావసర ధరలు పెంపు, త్రాగు నీరు, డ్రైనేజ్ కాలువల సమస్యను ప్రజలు తెలిపారు. ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య, పట్టణ ఉపాధ్యక్షులు తోట గణేష్, ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్, ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి, రవి కుమార్ రెడ్డి, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్ర శేఖర్, వీర మహిళలు దేవి, బతెమ్మ, శారద, సకుంతలమ్మ, రేవతి, జయంతి, రాజలక్ష్మి, నాయకులు దినేష్, గురవయ్య, రాజేష్, గిరీష్, శ్రీరామ్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)


## నేపాల్‌లో భారీ భూకంపం

భారత్‌లోని పలు ప్రాంతాలు కంపించాయి. దేశ రాజధాని దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లోని వివిధ ప్రాంతాల్లో భూప్రకంపనలు వచ్చాయి. భూప్రకంపనలతో ఏం జరుగుతుందో తెలియక దిల్లీ వాసులు తీవ్ర భయాం దోళనకు గురయ్యారు. పలు చోట్ల ఇళ్ల నుంచి బయటకు పరుగు లు తీశారు.

**నేపాల్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటాం**
**ఎంతో ఆవేదన కలుగుతోందన్న మోదీ**
**భారీ భూకంపంపై మోదీ స్పందన**

హిమాలయ దేశం నేపాల్‌ను భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో సంభవించిన భూకంపం కనీసం 128 మంది ప్రజల ప్రాణాలను హరించింది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఎన్నో ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఎంతో మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ... నేపాల్ లో భూకంపం కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధను కలిగిస్తోందని చెప్పారు. ఈ విషాదకర సమయంలో నేపాల్ కు అండగా ఇండియా ఉంటుందని... అన్ని రకాల సహాయ సహకారాలను నేపాల్‌కు అందిస్తామని తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కు నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ (ప్రచండ)ను ట్యాగ్ చేశారు.

## మోదీపై పీహెచ్‌డీ.. ముస్లిం మహిళకు డాక్టరేట్!




**ఢిల్లీ, నవంబర్ 4 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ నేతలలో ప్రముఖునిగా గుర్తింపు పొందారు. మోదీని ఆదర్శంగా తీసుకునేవారు మన దేశంలో చాలా మంది ఉన్నారు. వారణాసికి చెందిన నజ్మా పర్వీన్ ప్రధాని మోదీపై డాక్టరల్ స్టడీస్ పూర్తి చేశారు. ప్రధాని మోదీపై పీహెచ్‌డీ పూర్తి చేసిన తొలి ముస్లిం మహిళగా నజ్మా పర్వీన్ నిలిచారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితానికి నజ్మా ప్రభా వితురాలయ్యారు. నజ్మా మీడియాతో మాట్లాడుతూ పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్ కింద 'నరేంద్ర మోదీ రాజకీయ నాయకత్వం - ఒక విశ్లేషణాత్మక అధ్యయనం' పేరిట 2014లో దీనిని ప్రారంభించానని, 2023 నవంబరు ఒకటి నాటికి ఇది పూర్తయిందని తెలిపారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుం డి ప్రొఫెసర్ సంజయ్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో ఈ పరిశోధన పని పూర్తయిందన్నారు. తన పరిశోధన లో ప్రధానంగా ఐదు అధ్యాయాలు ఉన్నాయన్నారు. అవి అధికారం నుండి విముక్తి, కాంగ్రెస్ వంశ పాలన, ప్రధాని మోదీ రాజకీయ జీవితం, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన పనితీరు, ప్రతిపక్షాల ఆరోపణలు-విమర్శల కాలం, ప్రజలు- మీడియా మద్దతు అని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవితం తనను అమితంగా ఆకట్టుకున్నదని, దేశానికి జీవితాన్ని అంకితం చేసిన రాజకీయ నేతగా మోదీ కనిపించారని ఆమె తెలిపారు.

## జనచైతన్య యాత్రకు అనూహ్య స్పందన

**ఒంగోలు, నవంబర్ 4 (జనస్వరం) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో, ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ సూచన మేరకు స్థానిక నాయకులు యాదల సుధీర్, కర్రీ శ్రీను, శీలం సాయి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా జనచైతన్య యాత్ర 37వ రోజు ఒంగోలులోని 16వ డివిజన్‌లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ వారం రోజులు 16 డివిజన్లో వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు సమస్యలను గుర్తించడం జరిగిందని,ముఖ్యంగా అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి సమస్య, తాగునీటి సమస్య,సరైన డ్రైనేజీ వ్యవస్థ లేవకపోవడం, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, అకారణంగా పెన్షన్లు తొలగించడం వంటివి మా దృష్టికి వచ్చాయని తెలిపారు. వీటిని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకుని పోయి వారికి న్యాయం జరిగేలాగా చూస్తామని జనసేన నాయకులు స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల, ఒంగోలు నగర జనసేన పార్టీ




ప్రధాన కార్యదర్శి పల్ల ప్రమీల, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శి గోవింద్ కోమలి మరియు జనసేన నాయకులు జొన్న వెంకట్, ఉంగరాల వాసు, జనసేవ శ్రీనివాస్, చెన్ను నరేష్, మని తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయి పర్యటనలో పంతం సందీప్



**రాజమండ్రి, నవంబర్ 4 (జనస్వరం) :** కరప మండలం ఉప్పలంక గ్రామంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు సంగడి శ్రీను, మండల అధ్యక్షులు బండారు మురళి ఆధ్వర్యంలో ఉప్పలంక గ్రామంలో ఉమ్మడి మేనిఫెస్టోపై ఇంటింటికి వెళ్ళి చేయు ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ కుమా రుడు పంతం సందీప్ పాల్గొన్నారు. పంతం సందీప్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కష్టపడదా మన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి జనసేన - టీడీపీ ఉమ్మడి ప్రభుత్వాన్ని తీసుకొద్దా మని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోగిరెడ్డి గంగాధర్, తాటికాయల వీరబాబు, కరెడ్ల గోవింద్, శిరంగు శ్రీనివాస్, సోదే మునలయ్య, తెలుగుదేశం నాయకులు నూరుకుర్తి వెంకటేశ్వ రరావు, పెంకే శ్రీనివాస్ బాబా, వాసిరెడ్డి ఏసుదాసు, రాందేవు సీతయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికుడికి ఇంటి నిర్మాణానికి భరోసా ఇచ్చిన డా. విష్వక్ షేన్



**ఎచ్చర్ల, నవంబర్ 4 (జనస్వరం) :** మెట్టు వలస గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి జనసైనికుడు గొర్లె పాపి నాయుడు ఫ్యామిలీతో నివసించడానికి ఒక ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన నాయకులు డా. విష్వక్సేన్ 25 సిమెంట్ బస్తాలు ఇవ్వటం జరిగింది. ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగు ణంగా నడుస్తూ, ఆయన బాటలో సేవా కార్యక్ర మాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లావే రు నాయకులు కాకర్ల బాబాజీ, వేణు పాల్గొన్నారు.

# నాడు దుగ్గిరాల.. నేడు మాదిగాని..

- చీరాలకు వచ్చి ఉద్యమ స్ఫూర్తి రగిలించిన దుగ్గిరాల
- చీరాల నుండి వెళ్లి ఉద్యమ స్ఫూర్తి రగిలించిన మాదిగాని గురునాథం
- చీరాల కేంద్రంగా దుగ్గిరాల చీరాల పేరాల ఉద్యమం
- తాడేపల్లి కేంద్రంగా మాదిగాని గురునాథం ప్రజా ఉద్యమం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన చీరాల పేరాల ఉద్యమం
- దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాదిగాని గురునాథం ఉద్యమం
- సుమారు 333 రోజుల పాటు కొనసాగిన చీరాల పేరాల ఉద్యమం
- 1133 రోజులుగా కొనసాగు తున్న మాదిగాని గుర్నాథం ఉద్యమం
- ప్రభుత్వానికి మద్దతుగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఉద్యమం
- దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా 75 వేల గంటల ఉద్యమానికి శ్రీకారం.
- రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని ప్రతిపక్షా లకు హెచ్చరిక
- రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రజా ఉద్యమం
- సంక్షేమ పాలనకు మరో రూపమే ముఖ్యమంత్రి జగన్
- సీఎం జగన్‌కు 175కి 175 సీట్లు రావడం ఖాయం



**చీరాల, నవంబర్ 4 (జనస్వరం) :** ఇంతింతై.. వటుడి ంతై.. అన్న అంశాన్ని నిజం చేస్తూ, అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా, చీరాల నుండి ఢిల్లీ స్థాయికి ఎదిగి, నేషనల్ కమిషన్ ఫర్ ఎస్సీ, ఎస్టీ, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షునిగా, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికై, విశేష కృషి చేస్తున్న సీనియర్ నేత మాదిగాని గురునాథం, రాష్ట్రంలో జరుగుతున్న అరాచక వాదుల కుట్రలను చూసి చలించిపోయారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా, సంక్షేమ పాలనయే ధ్యేయంగా, రాష్ట్రాన్ని అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తుంటే, అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాల వైఖరి దారుణమంటూ, సీనియర్ నేత మాదిగాని గురునాథం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని ప్రోత్సహించక పోయినా ఫరవాలేదు కానీ, అభివృద్ధిని అడ్డుకోవడం దారుణమని, ప్రతిపక్షాల వైఖరిని తీవ్రంగా ఖండించారు. గత 75 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో, అతి చిన్న వయసులోనే, దేశంలోని అందరికీ ఆదర్శంగా ఉండేలా, సంక్షేమ పాల అందజేస్తున్న ఏకైక సీఎం జగన్ అని ప్రశంసిస్తూ, జగన్‌కి మద్దతుగా నిలిచి, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, ప్రజా ఉద్య మం చేపట్టారు. మూడు రాజధానుల ఏర్పాటుతో, చేపడుతున్న పాలనా వికేంద్రీకరణకు మద్దతుగా, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, తాళ్లాయ పాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, ఉద్యమానికి శ్రీకారం చుట్టడంలో కీలక పాత్ర పోషించారు. 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు సాధించడంతోపాటు, స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం ఏర్పాటుకు ఉద్యమం ఊతమిచ్చింది. పాలనా వికేంద్రీకరణ నిమిత్తం, మూడు రాజధానుల ఏర్పాటు సానుకూల దశలో ఉన్న సంగతి ప్రజలందరికీ తెలిసిందే. దేశ చరిత్ర లో కనీవినీ ఎరుగని రీతిలో, రిలే నిరాహారదీక్షలు 1133 రోజుకు చేరాయి. ఈ క్రమంలో ప్రతిపక్షాలని ఏకిపారేస్తూ, ప్రతి పక్షనేతల అవినీతి, అక్రమాలు, అరాచకాలను ఎండగడుతూ, సీఎం జగన్ హయాంలో వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు అంకితభావంతో, మాదిగాని గురునాథం కృషి చేస్తున్నారు.

**నాడు దుగ్గిరాల..., నేడు మాదిగాని**

చీరాల పేరాల ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఎంత పేరు ప్రతిష్టలు పొందారో, అదే స్ఫూర్తితో, అంబేద్కర్ భావజాలంతో, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, స్వర్గీయ మాదిగాని వెంకటేశ్వర్లు కుమారునిగా, రాజ్యాంగ పరిరక్షణకై, రాష్ట్ర అభివృద్ధికై, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, సీనియర్ నేత మాదిగాని గురునాథం, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు అదే స్థాయిలో, దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. నాడు చేపట్టిన చీరాల పేరాల ఉద్యమం ఇంచుమించు 333 రోజులు జరుగగా, మాదిగాని గురునాథం చేపట్టిన ప్రజా ఉద్యమం 1133 రోజుకు చేరి, ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించేలా ఇంకా కొనసాగుతూనే ఉండటం విశేషం.

చీరాలకు వచ్చిన దుగ్గిరాల ప్రజా సంక్షేమం కోరి, చీరాల పేరాల ఉద్యమం చేపట్టగా, చీరాల నుండి తాళ్లాయపాలెం వెళ్లి, ప్రజా సంక్షేమానికై సీనియర్ నేత మాదిగాని గురునాథం బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపట్టడం గమనార్హం.

**2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌కు 175కి 175 సీట్లు ఖాయం**

సంక్షేమ పాలనకు మరో రూపంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా, గతంలో ఏ ముఖ్యమంత్రి అందించని రీతిలో, అత్యద్భుతంగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి, 2024 ఎన్నికలలో, 175కు 175 సీట్లు రావడం ఖాయమని, అది కూడా అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్న ఆశాభావాన్ని మాదిగాని గురునాథం వ్యక్తం చేశారు.

## దోమల నివారణకు పసుపు రంగు జిగురు అట్టల వినియోగం శ్రేయస్కరం



వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి

**చీరాల, నవంబర్ 4 :** మిరప పంటను ఆశించు పురుగులు, దోమల నివారణకు పసుపు పచ్చ రంగు జిగురు అట్టలు శ్రేయస్కరమని, తద్వారా రైతులు తక్కువఖర్చుతో, అధిక పంటదిగుబడి సాధించవచ్చని, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణా రెడ్డి అన్నారు. చీరాల మండలం, కావూరి వారి పాలెం పంచాయితీపరిధిలోని, మిరప పంట పొలాలలో, ప్రకృతి వ్యవసాయంవారి సమన్వయంతో, రైతులకు అందజేసిన పసుపు పచ్చ రంగు జిగురు అట్టలను, ముఖ్య అతిధిగా హాజరైన ఛైర్మన్ రమణారెడ్డి, బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, శాస్త్రవేత్త,అధికారులతో కలిసి, పొలాలలో పాతారు. ఈ సందర్భంగా రమణా రెడ్డి మాట్లాడుతూ, మిరప పంటలను ఆశించు దోమలు, తామర పురుగులు, గుడ్లు పెట్టే కీటకాలు, ఈ అట్టలపైన వాలి చనిపోతాయన్నారు. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గితే, రైతులకు ఖర్చు తగ్గుతుందని, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులం తా ఈ పద్ధతిని పాటించాలని సలహా ఇచ్చారు. ఈ అట్టల ఏర్పాటుకు, ఎకరానికి కేవలం రు.250లు మాత్రమే అవుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్ కోరారు. రైతుల సంక్షేమం కోసం, వైసిపి ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను వివరించారు. రైతుల శ్రేయస్సు కోసం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ ఇన్చార్జ్ కరణం వెంకటేష్‌లు చేస్తున్న కృషిని తెలియజేశారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మండవశ్రీనివాసరావు కీటకాల శాస్త్రవేత్త రత్నకుమారి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డితో పాటు, చీరాల డివిజన్ ప్రకృతి వ్యవసాయ ఎం.ఐ.భారతి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఐసీఆర్పీ లు కవిత, శిరీష, నిర్మల, రైతులు పాల్గొన్నారు.

## కార్తికమాసం ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాలి



**పెదకాకాని నవంబర్ 3 (జనస్వరం) :** మల్లేశ్వరస్వామి వారి దేవస్థాన పాలకమండలి సమావేశం శనివారం పాలకమండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. దేవస్థానంలో కార్తీక మాసం 2023 సంబంధించి భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ దిగువ పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారని దేవస్థాన సహాయ కమీషనర్ యన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలు, క్యూలైనులు, చలువ పందిళ్ళు వగైరాలు ఏర్పాట్లు చేసి భక్తులకు క్యూ లైనులలో పాలు, మజ్జిగ, మంచినీరు విషయమై చర్చించారు. ఆలయ ప్రాంగణం అంత ప్రత్యేక శానిటేషన్ నిమిత్తం అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని శుభ్రంగా ఉండునట్లుగా చర్యలు తీసుకోవాలని, కార్తీక మాసంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, భక్తుల సౌకర్యార్థం, ఆది, సోమ తదితర పర్వదినాల్లో పోలీసుశాఖ, అగ్నిమాపకశాఖ, పంచాయితీశాఖ, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సేవలు వినియోగించుకోవాలని, ఆలయానికి విచ్చేయు భక్తులందరికి నిత్య అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయుటకు, అన్నప్రసాదాలు విచ్చేసి ప్రతి భక్తునికి అన్న ప్రసాద వితరణ స్వీకరించు విధంగా ఏర్పాట్లు చేయుచున్నారు. ఆలయానికి విచ్చేయు భక్తులకు పర్వదినాల్లో అదనంగా ఉచిత ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థాన సహాయకమిషనర్ కార్యనిర్వహణాధికారి యన్.శ్రీనివాసరెడ్డి ధర్మకర్తల మండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు, పాలకమండలి సభ్యులు, కొమ్మూరి శివ రత్నాలు, తోట రవీంద్ర, కారంకి శివనాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ళ వెంకటరావు, చీడిపూడి అరుణ, పాలడుగు వేంకటేశ్వరరావు, మందాళ జ్యోతి, పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ఎక్స్ ఆఫిషియో సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు రచయితలకు సన్మానం





**రేణిగుంట, నవంబర్ 4 (జనస్వరం) :** చిత్తూరు, వ్రాతలవట్ట మండలం, పేటమిట్ట, మంగళ్ విద్యా లయంలో తెలుగు రచయితలను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అమర రాజ సంస్థల వ్యవస్థాపకులు డా. గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, నామిని సుబ్రమణ్యం, సాకం నాగరాజు, పత్తిపాటి రమేష్ నాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందిచడంలో తమదైన ముద్రను చాటుతున్న రచయితలను అభినందించి "వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం" అందుకున్న తరుణంలో నామిని సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ, గల్లా రామచంద్ర నాయుడు కలలు సహకారం అవుతున్నాయని, విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని చెప్పారు.ఆధునిక కాలంలో విలువలు పెంపొందించడంలో కవులు రచయితలు ముఖ్యపాత్రను పోషిస్తున్నారని, వారు రాసేటటువంటి పుస్తకాల ద్వారా కథల ద్వారా పిల్లలందరిలో నైతికాభివృద్ధి పెంపొందుతుందని, రచయితలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రచయితలైన నామిని సుబ్రమణ్యం, శాకం నాగరాజు, పత్తిపాటి రమేష్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులలో పుస్తక పఠన నైపుణ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందేలా చేయడమే ముఖ్యమని తద్వారా ఎన్నో విలువలను అలవర్చుకుని వారి జీవితాన్ని సుగమం చేసుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్. సతీష్, ప్రిన్సిపల్ ధనంజయ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభ జయప్రదం చేయాలి

- జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ మునిరతి రామకృష్ణ
- ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పల్లె నర్సింగ్ రావు



**హైదరాబాద్, నవంబర్ 4 :** యూసఫ్ గూడా అంబేద్కర్ విగ్రహం దగ్గర శనివారం ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇంకా అనుబంధ సంఘాలు ఈ సందర్భంగా మునిరతి రామకృష్ణ పల్లె నర్సింగరావు మాట్లాడుతూ 11 నవంబర్ పరేడ్ గ్రౌండ్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును తక్షణమే చట్టబద్ధత కల్పించి ఏబిసిడి వర్గీకరణను చట్టసభల్లో ఆమోదించాలని విశ్వరూప మహాసభను జయప్రదం చేయాల్సిందిగా మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఈరోజు కరపత్రం విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ విశ్వరూప మహాసభకు ముఖ్యఅతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరవుతారని, అందరూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదానికి తరలి రావాల్సిందిగా ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జి మునిరాతి రామకృష్ణ మాదిగ, పల్లె నర్సింగ రావు మాదిగ ఎంఎస్‌పి కోఆర్డినేటర్ జూబ్లీహిల్స్, కొల్లూరు రాజేష్ మాదిగ, చిట్టి బాబు మాదిగ, భాస్కర్ మాదిగ దాసరి సతీష్ గిరి మాదిగ, ఆదిత్య ములుగు, మహేందర్ మాదిగ పాల్గొన్నారు.


## అంత్యక్రియల ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేత



**శాంతిపురం, నవంబర్ 4 (జనస్వరం) :** మండల పరిధిలోని కోనేరు కుప్పం గ్రామానికి చెందిన షేక్ బషీర్ సాబ్ అనే వైసీపీ కార్యకర్త శుక్రవారం మృతి చెందారు. దీంతో అతని అంత్యక్రియల ఖర్చులకోసం ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ ఆదేశాల మేరకు స్థానిక వైసీపీ నేతలు రూ.10,000లు బషీర్ సాబ్ భార్యకు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి రామకృష్ణ రెడ్డి, నేతలు మంజునాథ్, స్థానికులు జమీర్ బాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధినేత పవన్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ మెమోరియల్ అవార్డు

**శాంతిపురం, నవంబర్ 4 (జనస్వరం) :** కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు, ప్రజలకు సేవ చేస్తున్న ఆ సంస్థ అధ్యక్షుడు డా.ఎం.పవన్ కళ్యాణ్‌ను డబ్ల్యూఏసి బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ సంస్థ సర్దార్ వల్లభాయ్ పటేల్ మెమోరియల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధినేత డాక్టర్ ఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ అవార్డు రావడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇకపై మరింత బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేస్తానని మీడియాకు తెలిపారు. ఈ అవార్డును కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు డా.ఎం.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.




## పోలింగ్ బూత్లను పరిశీలించిన ఆర్డీవో




**ఆత్మకూరు నవంబర్ 4 (జనస్వరం) :** మండలంలోని మహిమలూరు, రామస్వామి పల్లి, రావుల కొల్లు, ఆత్మకూరు టౌన్‌లోని పలు పోలింగ్ బూతులను శనివారం ఆత్మకూర్ ఆర్డీవో కే.మధులత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా బూతులకు సంబంధించిన బిఎల్‌ఓలకు తగు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బిఎల్వోలు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని, త్వరలో వచ్చే కొత్త ఓటర్ లిస్టును పరిశీలించి లేని వాళ్ళకి ఓటు హక్కు కల్పించి ఓటర్ లిస్టులో ఉండి చనిపోయి ఊర్లు మారిన వారి ఓట్లను తొలగించాలన్నారు. అలాగే ఓటుపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంట తహసిల్దార్ వి.జగదీష్ బాబు, ఆర్ఐ పృధ్విరాజ్ ఆయా గ్రామాల వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్‌లో విజయవంతంగా ముగిసిన చిప్ డిజైనింగ్ పై వర్క్ షాప్



**చీరాల, నవంబర్ 4 :** చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో చిప్ డిజైనింగ్‌పై వర్క్ షాప్ విజయవంతంగా ముగిసినట్లు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి తెలియజేశారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి )విభాగం వారి ఆధ్వ ర్యంలో గత నెల 30 నుండి ఈ నెల 4వ తేది వరకు, బి.టెక్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు, ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ వారి సహకారంతో, చిప్ డిజైనింగ్‌పై వర్క్ షాపును నిర్వహించినట్లు, కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్.మొయిద వేణు గోపాలరావు తెలిపారు. ఆధునిక ఎలక్ట్రానిక్‌లో, చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని, వివిధ పనులను, వేగవంతంగాను, ఖచ్చితంగాను నిర్వహించటానికి, ఎలక్ట్రానిక్స్ పరికరాలను పనిచేయించటానికి, సరియైన చిప్ డిజైనింగ్ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో, చిప్ డిజైనింగ్ లోని ప్రాధమింకాంశాలు, చిప్ తయారీలోని వివిధ దశలు, చిప్ తయారు చేసేటపుడు, ఏయే అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు, ఐ.ఒ.టి విభాగాధిపతి డాక్టర్ యస్.ఇంద్రనీల్ తెలిపారు.చిప్ డిజైనింగ్ పై విద్యార్థులకు, ఈ వర్క్ షాప్‌లో లైవ్ వైర్, పి.సి. బి.,విజార్డ్ సాఫ్ట్ వేర్ పై ప్రాక్టికల్స్ నిర్వహించి, పరిశ్రమలలో ఉపయోగించే చిప్స్ తయారు చేయించటం జరిగిందని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ఎ.పి. యస్.యస్.డి.సి నుండి యం. ఉమా మహేశ్వర రావు, విద్యార్థులకు చిప్ డిజైనింగ్‌పై, అవగాహన కల్పించి వాటిని విద్యార్థులచే తయారు చేయించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధి పతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేరాల హైస్కూల్‌గ్రౌండ్‌లో ఇసుక తవ్వకాలు

- వెంగళరావునగర్ పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి
- ప్రభుత్వ వైద్యశాలకు గేట్లు అమర్చాలి
- పేరాల హైస్కూల్ క్రీడా మైదా నాన్ని కాపాడాలి
- సీపీఎం పాదయాత్ర లో వెలుగు చూసిన సమస్యలు




**చీరాల, నవంబర్ 4 (జనస్వరం) :** సిపిఎం పాదయాత్ర బృందం రెండో రోజు పట్టణంలో పర్యటించారు. పేరాల ఎఆర్ ఎం ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఇసుక అక్రమ వ్యాపారులు, విద్యార్థుల క్రీడా మైదానాన్ని కూడా వదల్లేదని పేర్కొన్నారు. సమారు 300 టిప్పర్ల వరకు పాఠశాల మైదానాన్ని తవ్వి, సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మైదానంలో ఇసుక తవ్విన గుం టలకు, పట్టణంలోని చెత్త, వ్యర్థాలతో నింపి, దానిపైన ఎర్ర మట్టి పోసి చదును చేశారని ఆరోపిం చారు. పాఠశాల మైదా నంలో ఇసుక తవ్వకాలపై, విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకో వాలని కోరారు. గతంలో విద్యా ర్థులు, సమీప ప్రాంత యువకు లు ఆడుకునేం దుకు, అనువుగా ఉన్న క్రీడా మైదానంలో,అక్రమం గా ఇసుక తవ్వి, ఆ గుంటలకు ఎర్రమట్టి పోసి చదును చేసి, ఆడుకునేందుకు వీలులేకుండా, మైదానం మధ్యలో పార్కునిర్మా ణం చేశారని,ఆ ప్రాంత యువకులు సిపిఎం బృంధం దృష్టికి తెచ్చారు. తక్షణం పాఠశాల మైదానాన్ని ఆడుకునేం దుకు, అనువుగా మార్చాలని కోరారు. వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్న, పేదల ఇళ్లకు పట్టాలు ఇచ్చి, వారి నివాస ప్రాంతంలో డ్రైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. శిధిలా వస్థకు చేరిన సంక్షేమ వసతి గృహ సముదాయ భవనాలను తొలగించి, నూతన భవనాలను నిర్మిం చాలని కోరారు. శిధిలావస్థ కు చేరిన భవనాల్లో, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా రన్నారు. అధికారులు ఆ భవనాలను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాల కు వెళ్లే అన్ని వైపులా గేట్లను అమర్చాలని కోరారు. పాదయాత్రలో సిపిఎం కార్యదర్శి ఎన్.బాబు రావు, నాయకులు ఎం.వసంత రావు, పి.కొండయ్య, జి.ప్రతాప్ కుమార్, ఎల్.జయరాజు, ఎన్.వెంకట్రావు, కె.రాజాలు, పి.ఆదిశంకర్, ఎం.సత్యమూర్తి, ఐ.వి.ప్రసాద్, వి.భగవాన్ దాస్, ఎం.అయ్య ప్ప రెడ్డి, ఎన్.లక్ష్మి, జి. శ్రీను, సత్యవేలు, శివనాడియన్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో పంచాయితీల అభివృద్ధి కుంటుపడింది

**బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కృష్ణారావు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు ప్రభాకర్**



**చింతపల్లి, నవంబర్ 4 (జనస్వరం) :** వైసీపీ పాలనలో పంచాయితీల అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు జైతి ప్రభాకర్ అన్నారు. శనివారం వారు మండలంలోని తమ్మంగుల, కుడుముసారి పంచాయతీలలోని లక్షింపురం, పుల్లమామిడి, గసైగొంది, పెద్దగొంది, ధోనిపొలాలు, వందనపల్లి, భీమునిపల్లి గ్రామాలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో పంచాయితీల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు అందిస్తున్న నిధులను దారి మళ్లించి పంచాయతీల అభివృద్ధి కుంటుపడేలా చేసిందన్నారు. గ్రామాలలో తాగు నీటి సమస్య పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న జల జీవన్ మిషన్ నిధులు, రహదారి సమస్య తీర్చేందుకు ఇస్తున్న ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారుమల్లించి సొంత ప్రయోజనంలకు ఖర్చు పెడుతోందన్నారు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్మీపురం పుల్లమామిడి గ్రామస్తులు వాగు నీరు త్రాగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే ఈ గ్రామాలకు తాగునీరు సదుపాయంతో పాటు రహదారి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడంలో విఫలం అవుతుందన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరవుతాయనే విషయాన్ని సర్పంచులు గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికలలో సర్పంచులు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాగిన బాలకృష్ణ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు గెంజి బాలరాజు యువ మోర్చా ప్రధాన కార్యదర్శి వనికిడి రాజన్న దొర జిల్లా కార్యదర్శి వసుపరి, శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి పోటుకురి, వరణ్ రాజు మండల ఉపాధ్యక్షులు పాడి కిషోర్ అధిక సంఖ్యలో అభిమానులు నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి వాటర్ ట్యాంకులను సద్వినియోగం చేసుకోవాలి

**తాజంగి సర్పంచ్ మహేశ్వరి**



**చింతపల్లి నవంబర్ 4 (జనస్వరం) :** తాగునీటి వాటర్ ట్యాంకులను సద్వినియోగం చేసుకోవాలని తాజంగి సర్పంచ్ వంతల మహేశ్వరి అన్నారు. తాజంగిలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మిస్తున ఇంటింటి కొళాయి పనులలో భాగంగా గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ గడుతూరి స్వర్ణలతతో కలసి ఆమె రెండు వాటర్ ట్యాంకుల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 30 లక్షల రూపాయలతో చేపడుతున్న ఈ పనులు రెండు బోర్లు, రెండు పంప్ హౌస్ లు, రెండు వాటర్ ట్యాంకులు, 2800 మీటర్ లతో ఇంటింటి కోలాయి పనులు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తాజంగిలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నా నీరు సరిపోని పరిస్థితిలు ఉన్నాయని, దానితో కొన్ని వీధుల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. నూతనంగా ఈ రెండు వాటర్ ట్యాంక్‌ల నిర్మా ణంతో సమస్య కొంతవరకైనా తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పం చాయతీ వార్డు సభ్యుడు కిలో సదాశివ, వంతల బాబురావు, కావేర్ల గణపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైసీపీ ఇంచార్జి వెంకటేష్‌కు పరామర్శ



**చీరాల, నవంబర్ 4 (జనస్వరం) :** రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై, చికిత్స పొందుతున్న, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇంచార్జీ కరణం వెంకటేష్‌ని, చీరాల నేతలు, హైదరాబాద్ బంజారా హిల్స్ లోని, వారి నివాసం వద్ద కలిసి పరామర్శించారు. వైసీపీ ఇంచార్జి వెంకటేష్‌ని పరామర్శించిన వారి లో, చీరాల నేత వైసీపీ జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ హుమ యూన్ కబీర్, షేక్ సుభాని, మేరుగ ఇస్సాకు తదితరులు ఉన్నారు.

## దుప్పట్లు, క్యాలెండర్ల పంపిణీ



**ఏఎస్ పేట, నవంబర్ 4 (జనస్వరం) :** మండలంలోని రాజోలు గ్రామంలో ఈఎంసీ చర్చి సంఘ కాపరి పాస్టర్ జాషువా చలి కాలం తీవ్రతగా ఉన్నందున పేద సంఘ విశ్వాసులకు దుప్పట్లు ఇవ్వ వలసినదిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎద్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ వారిని కోర డంతో వారు దుప్పట్లు 2024 నూతన సంవత్సరపు క్యాలెండర్లను ఫౌండేషన్ కార్యానివాహకులు పి. ఎడ్వర్డ్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ మాసాలలో చలి తీవ్రతగా ఉన్నందున పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తూ ఉంటామంది అందులో భాగంగానే ఈ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండే షన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టిబంద గ్రామానికి రహదారి సమస్య తీర్చడం ఆనందదాయకం

**జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ సోమారత్నం**



**చింతపల్లి నవంబర్ 4 (జనస్వరం) :** ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న పొట్టిబంద రహదారి సమస్య తీర్చడం ఆనందదాయకమని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ వనగల సోమారత్నం అన్నారు. శనివారం వారు మండలంలోని కొత్తపాలెం పంచాయితి పొట్టిబంద గ్రామానికి 60 లక్షల నిధులతో తలపెట్టిన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పొట్టిబంద రహదారి సమస్య తీర్చేందుకు పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, పొట్టబంద రహదారి సమస్య ఎన్నో ఏళ్లనాటిదని గ్రామస్తులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యులు దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందని, ఈ రహదారి సమస్య పరిష్కరించేందుకు ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని రూ.60 లక్షల నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారన్నారు. ఈ నిధులతో బోంగూడ నుండి పొట్టిబంద వరకు రహదారి నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. పాడేరు శాసనసభ్యుల చొరవతో ఏళ్ల తరబడి అపరిస్కృతంగా ఉన్న పొట్టిబంద రహదారి సమస్య పరిష్కారం అయ్యిందని, ఈ రహదారి శంకుస్థాపన తమ చేతుల మీదుగా జరగడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పొట్టిబంద పరిసర ప్రజలు పాడేరు శాసనసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి రాజులమ్మ, మండల కన్వీనర్ పాంగి గణబాబు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్ వనగల బెన్నిబాబు, గణేష్, గుత్తేదారుడు గణబాబు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విచారించి చర్యలు చేపడతాం : డీఎస్పీ



**ఆత్మకూరు, నవంబర్ 4 (జనస్వరం) :** పట్టణంలోని తన పిన్ని వద్ద ఉంటూ మెకానిక్ దుకాణంలో పనిచేస్తున్న బుచ్చిరెడ్డిపాలెంకి చెందిన రౌతు.వినయ్ గత నెల 26న బలవన్మణానికి పాల్పడిన ఘటనపై శనివారం ఆత్మకూరు డి.ఎస్.పి యన్.కోటారెడ్డి స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ వస్త్రాల షాపు యజమాని ఉమర్ ఫారుక్ అనే వ్యక్తి తన వాహనాన్ని మెకానిక్ షాపు వద్ద పార్కింగ్ చేసిన సమయంలో మెకానిక్ షాప్ లో పనిచేస్తున్న రౌతు వినయ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాన్ని కరెంట్ సామాగ్రి తొలగించాని వీరి మధ్య ఘర్షణ జరిగింది ఆ తరువాత పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలు రాజీకి వచ్చిన తర్వాత వినయ్ తమ స్వగ్రామానికి 24న వెళ్ళీ ఆత్మహత్య చేసుకున్నాడని, ఆత్మహత్య జరిగిన తరువాత పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వకుండ కర్మకాండలు నిర్వచించా రన్నారు. వినయ్ కుటుంబం వద్ద రిపోర్టు తీసుకుని విచారణ చేపట్టి వాస్తవాలను బట్టి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి అన్నారు. ఈ ఘటన ఘర్షణ వల్ల మాత్రమే జరిగిం దని ఎలాంటి హిందూ ముస్లిం ల తగాదాలు మతకల్లాహాలు కావని వారి వ్యక్తిగత ఘర్షణలు అని డి.ఎస్.పి వెల్లడించారు. ఈ సమావేశంలో సి ఐ జి వేణు ఎస్ఐలు ముత్యాలరావు, సాయి ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం



**చీరాల, నవంబర్ 4 (జనస్వరం) :** వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, చీరాల మండలం దేవాంగ పురిలోని, గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో, శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బట్ట మోహన్ రావు మాట్లాడుతూ, వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, అన్నదాన కార్యక్రమం 37వ రోజుకు చేరిందన్నారు. అన్నదాన కార్యక్రమా నికి, సహకరిస్తున్న రోట రీసభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఏవి సురేష్ బాబు, రోటరీ సభ్యులు బండారు రాజేష్, గుత్తి పరంజ్యోతి, సప్రం రోహిణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ బీర్షముండ జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగరాజు**



**చింతపల్లి నవంబర్ 4 (జనస్వరం) :** ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించ తలపెట్టిన భగవాన్ బీర్షముండ జయంతి వేడుకలను ఉద్యోగులు, గిరిజనులు గ్రామ గ్రామాన నిర్వహించుకోవాలని, అందులో భాగంగానే గిరిజన ఉద్యోగుల కార్యాలయాలలో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బౌడు గంగరాజు ఆధ్వర్యంలో భగవాన్ బిర్షముండా 149వ జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని, అటువంటి మహానుభావులను స్మరించుకోవడం గిరిజనుల జన్మ హక్కు అన్నారు. ఈ జయంతి వారోత్సవాలకు గిరిజనులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ వాల్ పోస్టర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దేపూరు శశి కుమార్, ఆర్గనైజేషన్ కార్యదర్శి చింతల సతీష్ కుమార్, కోశాధికారి గెమ్మేలి కామేశ్వరరావు, సలహాదారుడు లోచాలి చిట్టి నాయుడు, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు గోపినాథ్, ఉపాధ్యాయులు వీరభద్రం పడాల్, సన్యాసిరావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం



వన్డే ప్రపంచకప్–2023లో ఆస్ట్రేలియా మరో విజయం సాధించింది. అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 33 పరుగుల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. 287 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్.. 253 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 3 వికెట్లతో అదరగొట్టాడు. అతడితో పాటు మిచెల్ స్టార్క్, ప్యాట్ కమ్మిన్స్, హాజిల్‌వుడ్ తలా రెండు వికెట్లు సాధించారు. ఇంగ్లండ్ బ్యాటర్లలో బెన్ స్టోక్స్(64) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. డేవిడ్ మలాన్ (50) పరుగులతో పర్వాలేదనిపించాడు. ఇంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మార్నస్ లబుషేన్(71) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. స్టీవ్ స్మిత్(44), కామెరాన్ గ్రీన్(47) పరుగులతో పర్వాలేదనపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 4 వికెట్లతో చెలరేగగా.. మార్క్ వుడ్, అదిల్ రషీద్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. వీరితో పాటు లివింగ్‌స్టోన్, విల్లీ చెరో వికెట్ సాధించారు.

# న్యూజిలాండ్‌పై పాకిస్తాన్ విజయం.. సెమీస్ రేసులో



వన్డే ప్రపంచకప్–2023లో న్యూజిలాండ్‌కు పాకిస్తాన్ ఊహించని షాక్ తగిలింది. ఈ మెగా టోర్నీలో భాగంగా బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్‌పై 21 పరుగుల తేడాతో పాకిస్తాన్ విజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం పాకిస్తాన్ గెలుపొందింది. ఈ విజయంతో పాకిస్తాన్ తమ సెమీస్ అవకాశాలను సజీవంగా నిలుపుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 401 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ ఇన్నింగ్స్ 21. 3 ఓవర్లలో వికెట్ నష్టానికి 160/1 వద్ద ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. అయితే వర్షం తగ్గముఖం పట్టడంతో మ్యాచ్‌ను 41 ఓవర్లకు కుదించారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం పాకిస్తాన్ టార్గెట్‌ను 342 పరుగులు కుదించారు. మ్యాచ్ తిరిగి ప్రారంభమయ్యే సమయానికి పాకిస్తాన్‌కు 19. 3 ఓవర్లలో 182 పరుగులు అవసరమయ్యాయి. అయితే మ్యాచ్ ఆరంభమైన కొద్దిసేపిటికే మళ్లీ వరుణుడు రీ ఎంట్రీ ఇచ్చాడు. రెండో సారి ఆట నిలిచిపోయే సమయానికి పాకిస్తాన్ 179 పరుగులు చేసింది. అప్పటికే న్యూజిలాండ్ డీఎల్ఎస్ ప్రకారం.. 21 పరుగుల ముందంజలో ఉంది. ఈ క్రమంలో వర్షం తగ్గుముఖం పట్టే సూచనలు కన్పించకపోవడంతో పాకిస్తాన్‌ను డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం విజేతగా నిర్ణయించారు.

**జమాన్ సూపర్ ఇన్నింగ్స్..**

కాగా పాకిస్తాన్ విజయంలో ఆ జట్టు ఓపెనర్ ఫఖార్ జమాన్ కీలక పాత్ర పోషించాడు. జమాన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. భారీ లక్ష్య ఛేదనలో కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 63 బంతుల్లోనే తన సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 81 బంతుల్లో 8 ఫోర్లు ,11 సిక్స్‌లతో 126 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. అతడితో పాటు కెప్టెన్ బాబర్ ఆజం(66 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

## World Cup Points Table

| Team | P | W | L | NR | NRR | Pts |
|---|---|---|---|---|---|---|
| IND | 7 | 7 | 0 | 0 | +2.102 | 14 |
| SAF | 7 | 6 | 1 | 0 | +2.290 | 12 |
| AUS | 7 | 5 | 2 | 0 | +0.924 | 10 |
| NZL | 8 | 4 | 4 | 0 | +0.398 | 8 |
| PAK | 8 | 4 | 4 | 0 | +0.036 | 8 |
| AFG | 7 | 4 | 3 | 0 | -0.330 | 8 |
| SRL | 7 | 2 | 5 | 0 | -1.162 | 4 |
| NED | 7 | 2 | 5 | 0 | -1.398 | 4 |
| BAN | 7 | 1 | 6 | 0 | -1.446 | 2 |
| ENG | 7 | 1 | 6 | 0 | -1.504 | 2 |

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211 REGD NO : APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.